teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 301 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | గురువారం 7 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## రైతుల కన్నీరు ప్రభుత్వానికి కనిపించడం లేదా

- రేవంత్ రెడ్డికి ఢిల్లీపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిందే
- ప్రతి గింజకు కేంద్రమే పైసలిస్తోంది.. రాష్ట్రానికేం కష్టం
- ధాన్యం కొనుగోళ్లపై బండి సంజయ్ నిప్పులు



## పినపాక భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



- దశాబ్దాల వివాదానికి ఎండ్ కార్డ్
- భద్రాద్రి జిల్లాలోని ఆ 600 ఎకరాలు అటవీ భూములే
- తేల్చిన చెప్పేసిన సుప్రీం కోర్ట్

న్యూ ఢిల్లీ, మే 06 (తీన్మార్ న్యూస్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాల్వలనాగరంలోని 600 ఎకరాల వివాదాస్పద భూములపై సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించింది. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఈ న్యాయ పోరాటానికి స్వస్తి పలుకుతూ.. ఆ భూమి రక్షిత అటవీ ప్రాంతమేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఒక ముఖ్యమైన విషయాన్ని వెల్లడించింది. "రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలు - మిగతా 2లో

## ఒకే ఒక్కడు తరహా మార్పు దేశానికే ముప్పు



- తమిళనాడులో విజయ్ సీఎం అవ్వడం ఊహించలేదు
- యువత ఆలోచనా విధానం ప్రమాదకరం
- జయప్రకాశ్ నారాయణ సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో..



## భగభగల నుంచి రిలీఫ్



- ముంచుకొస్తున్న వానలు
- ప్రజలు, రైతులకు అలర్ట్
- ఒకవైపు చల్లని కబురు.. మరోవైపు ఈదురు గాలుల ముప్పు
- వాతావరణ శాఖ కీలక సూచనలు

హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్)

తెలంగాణ ప్రజలకు ఎండల తీవ్రత నుండి ఉపశమనం కలిగిస్తూ భారత వాతావరణ శాఖ చల్లని వార్తను అందించింది. బుధవారం విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉరుములు, మెరుపులు, - మిగతా 2లో




## ఇకపై బియ్యంతో పాటు జొన్నల పంపిణీ

- ప్రజా పంపిణీలో తెలంగాణ సర్కార్ కీలక మార్పులు
- కార్డుదారులకు, గురుకులాల్లో పంపిణీకి డిప్యూటీ సీఎం ఆదేశాలు

హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):

ప్రజా పంపిణీ వ్యవస్థలో తెలంగాణ సర్కార్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు పౌష్టికాహారమైన జొన్నలను కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించి - మిగతా 2లో

## కాంగ్రెస్ నయవంచనపై బీఆర్ఎస్ కన్నెర్ర



- హనుమకొండలో రైతు సంగ్రామ సదస్సు
- రైతులు ఆత్మహత్య చేసుకోవద్దు
- మళ్లీ వచ్చేది కేసీఆర్ రాజ్యమే: కేటీఆర్ భరోసా
- సదస్సులో 4 కీలక తీర్మానాలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్ల వెల్లువ

హనుమకొండ, మే 06 (తీన్మార్ న్యూస్):

వరంగల్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందనే నిరసనతో, 2026 మే 6న బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా రైతు సంగ్రామ సదస్సు నిర్వహించింది. హనుమకొండలోని హంటర్ రోడ్‌లో, గ్రీన్ వుడ్ స్కూల్ సమీపంలోని 4 ఎకరాల స్థలంలో ఈ సదస్సు జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ నయవంచనకు బలైపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులు - మిగతా 2లో



## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో అవినీతి

- ఫీజుల నియంత్రణలో సర్కార్ విఫలం
- ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై కవిత ధ్వజం
- హెచ్‌పీఎస్‌లో అక్రమాలపై విచారణకు డిమాండ్
- సీఎం సన్నిహితుల భూకబ్జా యత్నాలు
- టీఆర్ఎస్ అధినేత్రి కవిత ఫైర్

## బెంగళూరుకు బీసీసీఐ షాక్



- అహ్మదాబాద్‌కు మారిన ఫైనల్ వేదిక
- వేదికలపై చెలరేగుతున్న వివాదం
- ఆతిథ్యం తరలిపోవడంపై కేఎస్‌సీఏ ఆగ్రహం

## అర్ధరాత్రి మహిళా సీపీ ఆపరేషన్

- కామన్ లేడీగా మారి పోకిరీల ఆటకట్టించిన సుమతి
- 40 మంది ఆకతాయిలు పట్టివేత





## నీ స్థాయి ఎంత.. నీ బతుకెంత

- గాంధీ కుటుంబంపై విమర్శిస్తే ఊరుకోం
- కేటీఆర్‌కు మహేష్ కుమార్ గౌడ్ వార్నింగ్
- తెలంగాణ రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్న స్థాయి వివాదం

## మెట్రో సెకండ్ ఫేజ్‌కు లైన్ క్లియర్..?

- కేంద్ర మంత్రి ఖట్టర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ
- హైదరాబాద్ మెట్రో విస్తరణపై ఢిల్లీలో చర్చలు

తెలంగాణ బ్యూరో, మే 06 (తీన్మార్ న్యూస్):

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో సమావేశమయ్యారు. ఈ భేటీలో.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకమైన మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టుకు తుది అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. మెట్రో ఫేజ్-2కు సంబంధించి ఇప్పటికే కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ, ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన పూర్తిస్థాయి అధికారిక అనుమతులను త్వరితగతిన ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ప్రతిపాదించిన మెట్రో కారిడార్‌ను ఫేజ్-3 కింద పరిగణనలోకి తీసుకోవాలని కూడా సీఎం విన్నవించారు. పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో - మిగతా 2లో



# అర్ధరాత్రి మహిళా సీపీ ఆపరేషన్



హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):

మహిళల భద్రత పట్ల అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా తెలుసుకునేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. యూనిఫామ్ పక్కనపెట్టి, ఎలాంటి సెక్యూరిటీ లేకుండా అర్ధరాత్రి దిల్ సుఖ్ నగర్ బస్టాండ్‌లో ఒక సాధారణ మహిళగా నిలబడి పోకిరీల ఆటకట్టించారు.

**సాధారణ మహిళగా బస్టాండ్‌లో పడిగాపులు**

కమిషనర్‌గా విధుల్లో చేరిన ఐదు రోజులకే సుమతి ఈ ఆకస్మిక ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. పోలీసు యంత్రాంగానికి సైతం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒంటరిగా దిల్ సుఖ్ నగర్ చేరుకున్నారు. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న సగటు మహిళలా ఆమె నిల్చున్నారు. ఈ సమయంలో రాత్రి వేళల్లో ఒంటరి మహిళలకు ఎదురయ్యే వాస్తవ పరిస్థితులను, వేధింపులను ఆమె స్వయంగా చవిచూశారు.

**చుట్టుముట్టిన 40 మంది పోకిరీలు**

అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న మహిళను చూసి సుమారు 40 మంది ఆకతాయిలు ఆమెను చుట్టుముట్టారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆమె పట్ల వెకిలి చేష్టలకు పాల్పడుతూ, అసభ్యకరమైన ప్రశ్నలు వేస్తూ తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. పట్టుబడిన వారిలో అత్యధికంగా చదువుకునే వయసున్న విద్యార్థులు, యువకులే ఉండటం గమనార్హం.

**మూడు గంటలైనా రాని పెట్రోలింగ్.. మొక్కవోని ధైర్యంతో సీపీ**

ఒక పోలీస్ కమిషనర్ ఏకధాటిగా మూడు గంటల పాటు నడిరోడ్డుపై వేధింపులు ఎదుర్కొంటున్నా, అటువైపు కనీసం ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా రాకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అయినప్పటికీ సీపీ సుమతి మొక్కవోని ధైర్యంతో అక్కడే ఉండి అందరి కదలికలను గమనించారు. ఎట్టకేలకు రాత్రి 3:30 గంటల సమయంలో ఒక బీట్ కానిస్టేబుల్ ఆ దారిలో వచ్చారు.

**పోలీస్ స్టేషన్‌కు తరలింపు.. కౌన్సిలింగ్**

కానిస్టేబుల్ రాకతో వెంటనే అప్రమత్తమైన సీపీ సుమతి, తనను ఇబ్బంది పెట్టిన ఆ 40 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ఆకతాయిలకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. దిల్ సుఖ్ నగర్ పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో హాస్టల్స్ ఉండటం వల్లే ఇక్కడ ఆకతాయిల బెడద ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సీపీ సుమతి చేపట్టిన ఈ సాహసోపేతమైన ఆపరేషన్ పట్ల మహిళల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో అవినీతి

హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):

ప్రతిష్టాత్మక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అడ్డగోలు అవినీతికి నిలయంగా మారిందని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హెచ్‌పీఎస్‌లో జరుగుతున్న అక్రమాలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు.

**హెచ్‌పీఎస్‌పై సంచలన ఆరోపణలు**

ఫీజుల పెంపు: ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్‌పీఎస్ ఈ ఏడాది ఏకంగా 120 శాతం ఫీజు పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న స్కూళ్లలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక బడా ప్రైవేట్ స్కూళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ప్రశ్నించారు.

ఒకే వ్యక్తి పెత్తనం: గడచిన 14 ఏళ్లుగా హెచ్‌పీఎస్‌లో ఒకే వ్యక్తి అదే పదవిలో కొనసాగుతూ భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

సత్య నాదెళ్ల విరాళాల మళ్లింపు: స్కూల్ పూర్వ విద్యార్థి, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల హెచ్‌పీఎస్‌కు ఇచ్చిన భారీ విరాళాలకు ఎలాంటి లెక్కాపత్రం లేదని, ఆ నిధులు దారి మళ్లాయని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

భూకబ్జా యత్నాలు: క్యాంపస్‌లోని దాదాపు 30 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ.. ప్రభుత్వ వైఫల్యం

1. ఫీజుల నియంత్రణ చట్టాలను రాష్ట్రంలో తుంగలో తొక్కుతున్నారని కవిత విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాల్సిన ముఖ్యమంత్రే స్వయంగా ప్రైవేట్ స్కూళ్ల ప్రారంభోత్సవాలకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు.

2. ?ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా ప్రభుత్వం తక్షణమే జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

3. ?తెలంగాణలో కుటుంబాలు తమ ఆదాయంలో 60 నుంచి 70 శాతం కేవలం విద్య, వైద్యం కోసమే ఖర్చు చేస్తున్నాయని, తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ యాజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు.

ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఎంఎస్–7 జీవో ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతోందని కవిత ఆరోపించారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

?టీఆర్ఎస్ వస్తే ఉచిత విద్య, వైద్యం రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేన (౧=హా) అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సైతం పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై వెంటనే స్పందించకపోతే, కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలతో పోరాటం ఉధృతం చేస్తామని, కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

## జిల్లా వ్యాప్తంగా 41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటు

**గట్టమ్మ వద్ద 11 కె.వి. ఉప కేంద్రం ప్రారంభం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ లిసీతక్క)**



ములుగు జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):

ములుగు జిల్లా వ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.41 కోట్ల నిధులతో 12 విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ములుగు గట్టమ్మ వద్ద రూ.3.76 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన 11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రూ.41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే 3 ఉప కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాగా, మరో ఉప కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మిగిలిన ఉప కేంద్రాలు వివిధ దశల నిర్మాణ పనులలో ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, టీఎస్ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ బిక్షపతి, డీఈ నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీ స్థాయి ఎంత.. నీ బతుకెంత

హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాజకీయ క్షేత్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. తాజాగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేటీఆర్ వాడే పదజాలాన్ని తప్పుబడుతూనే, ఆయన గతాన్ని ప్రస్తావిస్తూ మహేష్ కుమార్ గౌడ్ విమర్శల దాడిని ఎక్కుపెట్టారు. రాహుల్ గాంధీ మరియు గాంధీ–నెహ్రూ కుటుంబంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలను మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మోతిలాల్ నెహ్రూ కాలం నుండి దేశ స్వాతంత్ర్యం కోసం ఆస్తులు త్యాగం చేసి, ప్రాణాలర్పించిన చరిత్ర ఆ కుటుంబానిదని ఆయన గుర్తు చేశారు. అటువంటి మహోన్నత చరిత్ర ఉన్న కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే అజ్ఞానంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ వ్యక్తిగత గతాన్ని ప్రస్తావిస్తూ మహేష్ కుమార్ గౌడ్ అత్యంత ఘాటుగా స్పందించారు. "అమెరికాలో పెట్రోల్ బంకుల్లో పనిచేసుకునే స్థాయి నుంచి వచ్చిన నువ్వు.. ఇవాళ ఇంతలా మాట్లాడుతున్నావా?" అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించిన ఆయన, ఉద్యమకారులు కష్టపడి నిర్మించుకున్న తెలంగాణలో, బీఆర్ఎస్ నాయకత్వం 'చీమలు పెట్టిన పుట్టలో పాముల్లా' వచ్చి చేరి అధికారాన్ని అనుభవించిందని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ కోసం పోరాడింది ఒకరైతే, అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్లు గడించింది మరొకరని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. తన స్థాయిని, గతాన్ని మర్చిపోయి ఇష్టారీతిన మాట్లాడటం సరికాదని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మరియు రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి.

## మెట్రో సెకండ్ ఫేజ్‌కు లైన్ క్లియర్..?

-మొదటిపేజీ తరువాయి

ఉన్న వివిధ నిధులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణ అత్యంత ఆవశ్యకమని సీఎం వివరించారు. ముఖ్యంగా జేబీఎస్ – మేడ్చల్, జేబీఎస్ – శామీర్‌పేట వంటి కీలక మార్గాల విస్తరణ ద్వారా నగరవాసులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ఖట్టర్ ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మెట్రో అనుమతులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఇతర అభివృద్ధి పనులపై కూడా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు.

## భగభగల నుంచి రిలీఫ్

-మొదటిపేజీ తరువాయి

ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడా పడే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీనివల్ల గత కొద్దిరోజులుగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండల తీవ్రత తగ్గి, వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుందని అధికారులు వెల్లడించారు. ఈ వాతావరణ మార్పుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గుతాయని, తద్వారా వేసవి తాపం నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో రానున్న మూడు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఐఎండీ పేర్కొంది. రాజధాని హైదరాబాద్‌లో మే 6న ఉష్ణోగ్రత 38–39శీజ వరకు నమోదయ్యే అవకాశం ఉండగా, మే 7 మరియు 8 తేదీల్లో అది మరింత తగ్గి 37–38శీజ వద్ద నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, వర్షాలు కురిసే సమయంలో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉన్నందున రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవడంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ఎవరూ ఆరుబయట, చెట్ల కింద ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ అకాల వర్షాలు ఎండల నుంచి ఉపశమనం ఇచ్చినప్పటికీ, బలమైన గాలుల వల్ల కలిగే నష్టాన్ని నివారించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా, నిన్న వీచిన భారీ ఈదురుగాలులకు మంచిర్యాల జిల్లాలో ఓ షెడ్డు కూలి నలుగురు వ్యక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

## పినపాక భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

-మొదటిపేజీ తరువాయి

కోసం మాత్రమే ఉపయోగపడతాయి. అంతేకానీ, అవి సదరు భూములపై యాజమాన్య హక్కులను కల్పించవు" అని కోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇదే అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది. 1950లో నిజాం ప్రభుత్వం జారీ చేసిన ఫారెస్ట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ అప్పీలుదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే.. ఆ భూమి తమదేనని నిరూపించుకోవడానికి అప్పీలుదారులు ఎలాంటి ఒరిజినల్ పత్రాలను సమర్పించలేదని ధర్మాసనం గుర్తించింది. దీంతో 1950 నాటి నోటిఫికేషన్ ప్రకారం ఆ 600 ఎకరాలు అటవీ భూమిగానే కొనసాగుతాయని కోర్టు తేల్చి చెప్పింది. అప్పీలుదారులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు, అటవీ భూముల పరిరక్షణ విషయంలో రాజీ పడలేమని పరోక్షంగా సంకేతాలిచ్చింది. ఈ తీర్పుతో గత కొన్ని ఏళ్లుగా కాల్వలనాగరం భూములపై నెలకొన్న ఉత్కంఠకు ముగింపు పడింది. అటవీ శాఖకు ఈ తీర్పు పెద్ద ఊరటనిచ్చింది.

## ఒకే ఒక్కడు తరహా మార్పు దేశానికే ముప్పు

హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):

ఇటీవల వెల్లడైన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.. యావత్ దేశాన్నీ ఆశ్చర్యానికి గురిచేశాయి. ఊహించని రీతిలో విజయ్ టీవీకే పార్టీ (తమిళగ వెట్రి కళగం) అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నట్లు తెలుస్తోంది. తమిళ రాజకీయాల్లో సంచలనం రేపిన విజయ్ అండ్ పార్టీ విజయంపై లోక్ సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ పెట్టిన రెండేళ్లకే విజయ్ సీఎం పీఠాన్ని చేరుకుంటాడని తాను ఊహించలేదన్నారు. ఈ ఫలితాలు చూసి తాను చాలా దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. తమిళనాడులో మంచి పాలన అందిస్తున్న స్టాలిన్ ఘోర ఓటమి పాలవ్వడంతో తాను షాకయ్యానని తెలిపారు. ప్రజలు విజయ్ వైపు మొగ్గుచూపడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ముఖ్యంగా జన్ జీ తరానికి చెందిన యువత.. వెంటనే అద్భుతాలు జరిగిపోవాలని ఆశిస్తున్నారని, ఒకే ఒక్కడు సినిమాలో హీరో అర్జున్ ఒక్కరోజులోనే అన్నీ మార్చేసినట్లు.. రియల్ లైఫ్ లోనూ క్షణాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారన్నారు. ఈ తరహా ఆలోచనా విధానం చాలా ప్రమాదకరమని, అభివృద్ధికి సమయం పడుతుందన్నారు. మార్పు కోరుకోవడం మంచిదే అయినా.. అది వెంటనే జరగాలనుకోవడం దేశానికి మంచిది కాదన్నారు. ఇక స్టాలిన్ ఓటమి వెనుక కుట్రలు, వ్యూహాలు ఉండి ఉండొచ్చన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ పరిణామంపై ఆత్మవిమర్శ చేసుకోవాలని, లేదంటే దేశం ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేశారు.


## ఇకపై బియ్యంతో పాటు జొన్నల పంపిణీ

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ప్రాథమిక కసరత్తును వేగవంతం చేసింది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన జొన్నలు, మొక్కజొన్నలను రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులోకి తేవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడంలో భాగంగా జొన్నలను వినియోగించాలని భట్టి సూచించారు. కేవలం అన్నం మాత్రమే కాకుండా, చిరుధాన్యాల వాడకాన్ని పెంచడం ద్వారా ప్రజల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఈ జొన్నల పంపిణీ విధానం అమల్లోకి రానుంది.

## కాంగ్రెస్ నయవంచనపై బీఆర్ఎస్ కన్నెర్ర

-మొదటిపేజీ తరువాయి



గుండె ధైర్యం కోల్పోవద్దని, వారికి మళ్లీ మంచి రోజులు వస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. మరో రెండేళ్లలో కాంగ్రెస్ "రాబంధు" రాజ్యం పోయి, తిరిగి "రైతుబంధు" కేసీఆర్ రాజ్యం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**రైతు సంగ్రామ సదస్సులో నాలుగు కీలక తీర్మానాలు**

రైతుల పక్షాన రైతు సంగ్రామ సదస్సులో నాలుగు ప్రధాన తీర్మానాలు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. రైతుల సంక్షేమం కోసం చేసిన ఈ తీర్మానాలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. సదస్సులో ఆమోదించిన డిమాండ్లు కింది విధంగా ఉన్నాయి.

1. రూ. 10 లక్షల పరిహారం: కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే వెయ్యి మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని, రోడ్డున పడ్డ ప్రతి బాధిత రైతు కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలి.

2. వరంగల్ డిక్లరేషన్ అమలు: వరంగల్ రైతు డిక్లరేషన్ వేదికగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన 34 హామీలను తక్షణమే అమలు చేయాలి.

3. అన్ని పంటలకు రూ. 500 బోనస్: ఎలాంటి ఆంక్షలు, నిబంధనలు విధించకుండా రైతులు పండించే అన్ని రకాల పంటలకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

4. రుణమాఫీ మరియు రైతుబీమా పునరుద్ధరణ: పెండింగ్‌లో ఉన్న రూ. 2 లక్షల రుణమాఫీని వెంటనే పూర్తి చేసి, రైతులకు సంపూర్ణ రుణ విముక్తి కల్పించాలి. అలాగే, రైతుబంధు సాయాన్ని సక్రమంగా ఖాతాల్లో జమ చేయడంతో పాటు, నిలిచిపోయిన 'రైతు బీమా' పథకాలను వెంటనే పునరుద్ధరించాలి.

# రైతును రాజును చేసే సంకల్పంతో సర్కార్ పనిచేస్తుంది

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**

**ములుగు జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**

రైతులను రాజులు చేయాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటుచేసిన 99 రోజుల ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతులను రాజు చేయాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఇందులో భాగంగానే రైతులకు ఎన్నడూ లేనటువంటి విధంగా రుణమాఫీ చేయడం జరిగిందని, వ్యవసాయ పెట్టుబడికి రైతు భరోసా కల్పిస్తున్నామని, వ్యవసాయ యంత్రాలపై ప్రత్యేక సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. రైతు వారోత్సవాలలో భాగంగా హనుమకొండ వేదికగా మూడు రోజులపాటు విస్తృత స్థాయి అవగాహన కల్పిస్తూ వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీ వివరాలను తెలియపరుస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.



రైతులందరూ ఒకే రకమైన పంట సాగుపై ఆధారపడకుండా, భౌగోళిక పరిస్థితులు, ప్రజల డిమాండ్‌ను బట్టి పంటల సాగు మార్చాలని సూచించారు. వరి, పప్పుధాన్యాలు, పత్తి, పామాయిల్, కందులు, జొన్నలు వంటి రకరకాల పంటలు పండిస్తేనే సమతుల్యత ఉంటుందన్నారు. అధికారులు రైతులకు లాభం వచ్చే పంటలపై, కష్టం తక్కువ ఫలితం ఎక్కువ వచ్చే విధానాలపై, పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పూర్తికి అవగాహన కల్పించాలి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**

పెండింగ్ ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మున్సిపల్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవో లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు మంజూరు పత్రాలు అందుకుని ఇంటి నిర్మాణాలకు పునాది వేసిన వారికి అవగాహన కల్పించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ లో సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైలెట్ గ్రామాలలో పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం అవుతున్న ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పంచాయతీ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలక అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, హౌసింగ్ ఏ.ఈ శ్రీకాంత్, అన్ని మండలాల ఎంపీడీవో లు, హౌసింగ్ ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**

పెండింగ్ లో ఉన్న భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలో భూ భారతి, సాదా బైనామా, బల్క్ భూ సమస్యలు తదితర అంశాలపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతీలో అందిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే సాదాబైనామల సమస్యలను కూడా జాప్యం చేయకుండా పరిష్కరించాలని పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు నోటీసులు అందించి సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పలు మండలాల్లో ఉన్న బల్క్ ల్యాండ్ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ బాలకృష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ డి కుసుమ కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నబోయినపల్లిలో ప్రజా దర్బార్

**ప్రజల చెంతకు మంత్రి సీతక్క**
**స్వయంగా దరఖాస్తుల స్వీకరణ**
**భారీగా తరలివచ్చిన జనం**



**ఏటూనాగారం, మే 06 (తీన్మార్ న్యూస్):**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఏటూరునాగారం మండలం చిన్నబోయిన పల్లి గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో చిన్నబోయినపల్లి, శివాపూర్, షాపల్లి గ్రామాల ప్రజల నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోలతో కలిసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.,సంపత్ రావు,గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డిఓ వెంకటేష్, గ్రామాల సర్పంచులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తా

**సత్వర పనులకు అధికారులను ఆదేశిస్తా**
**సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క**



**ములుగు జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**

జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనులు ప్రారంభించిన వెంటనే నిధులు మంజూరు చేసే బాధ్యత తనదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హామీ ఇచ్చారు. బుధవారం ములుగులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆమెను కలిసి, భవన నిర్మాణం మరియు ఇండ్ల స్థలాల కేటాయింపుపై వినతి పత్రం సమర్పించారు. ?ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో పాత్రికేయుల కోసం ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. 2024లోనే భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ, నేటికీ పనులు మొదలుకాకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులలో ఐక్యత లోపించడం, వివిధ వర్గాలుగా విడిపోవడం వల్లే పనుల్లో జాప్యం జరుగుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. భవన నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ?వినతి పత్రం అందజేసిన వారిలో జర్నలిస్ట్ జాక్ జిల్లా కన్వీనర్ గుర్రపు శ్రీధర్, గౌరవ అధ్యక్షులు జినుకల ప్రభాకర్, కో– కన్వీనర్ ఎనగందుల కొమురయ్య, నాయకులు రంజిత్, రాజు వర్ధన్ మరియు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## రైతుల కన్నీరు ప్రభుత్వానికి కనిపించడం లేదా

**కరీంనగర్, మే 06 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్రంలో అకాల వర్షాలు, ఈదురు గాలుల ధాటికి రైతాంగం కన్నీరు పెడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (ఐకేపీ సెంటర్లు) నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించారు. వేల క్వింటాళ్ల వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ధాన్యం సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బండి సంజయ్ తిప్పికొట్టారు. ప్రతి గింజకు కేంద్ర ప్రభుత్వమే నిధులు చెల్లిస్తోందని ఆయన స్పష్టం చేశారు. కేవలం పంట విలువే కాకుండా, సుతిలీతాడు, దబ్బడం, రవాణా ఛార్జీలు మరియు ఇతర నిర్వహణ ఖర్చులన్నీ కేంద్రమే భరిస్తోందని గుర్తు చేశారు. వడ్లు కొనుగోలు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం కమీషన్ కూడా ఇస్తోందని, ఇన్ని సౌకర్యాలు ఉన్నా కొనుగోళ్లు ఎందుకు వేగవంతం చేయడం లేదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ పనితీరుపై గణాంకాలతో బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు కనీసం 16 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సేకరించలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పర్యటనల మీద ఉన్న శ్రద్ధ, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలపై లేదని ఎద్దేవా చేశారు. మంత్రులు ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల తడిసిన ప్రతి గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బండి సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జాప్యం వల్ల రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రైతుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వం తన మొండివైఖరి వీడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## ఉద్యోగార్థుల వయోపరిమితి పెంపుపై సర్కార్ సానుకూలత

**నిరుద్యోగుల పక్షాన కోదండరాం, అద్దంకి సీఎంకు వినతి**
**వయోపరిమితి సడలింపుతో లక్షలాది మందికి ఊరట**
**భట్టి విక్రమార్క హామీ.. సడలింపుపై త్వరలో సమీక్ష**




**హైదరాబాద్, మే 06 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు త్వరలోనే తీపి కబురు అందే అవకాశం కనిపిస్తోంది. భవిష్యత్తులో వెలువడనున్న ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి గరిష్ట వయోపరిమితిని మరో 10 ఏళ్ల పాటు సడలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ కోదండరాం మరియు ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో పదేళ్ల పాటు, ఆ తర్వాత గత పదేళ్ల పాలనలోనూ సరైన నియామకాలు జరగలేదని నేతలు ప్రభుత్వానికి వివరించారు. ఈ సుదీర్ఘ 20 ఏళ్ల కాలంలో సరైన నోటిఫికేషన్లు రాకపోవడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగానికి ఉండాల్సిన అర్హత వయస్సును దాటిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాల వల్ల నష్టపోయిన యువతకు ఈ ప్రభుత్వం మానవీయ కోణంలో అండగా నిలవాలని కోరారు. ఈ ప్రతిపాదనల పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలత వ్యక్తం చేశారు. నిరుద్యోగుల సమస్యలపై నేతలతో లోతుగా చర్చించిన ఆయన, వయోపరిమితి సడలింపు వల్ల చేకూరే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాన్ని వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతిగా ఉంటుందని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే నోటిఫికేషన్లలో ఈ 10 ఏళ్ల సడలింపు అమలైతే, వయోపరిమితి దాటిపోయి నిరాశలో ఉన్న వేలాది మంది అభ్యర్థులు మళ్లీ పోటీ పరీక్షలు రాసేందుకు అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## బెంగళూరుకు బీసీసీఐ షాక్


తీన్మార్ న్యూస్ డెస్క్, మే 06 (తీన్మార్ న్యూస్): ఐపీఎల్ 2026 సీజన్ తుది అంకానికి చేరుకుంటున్న వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకున్న ఒక నిర్ణయం క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మే 31న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన గ్రాండ్ ఫైనల్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి మారుస్తూ బోర్డు అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేవలం ఫైనల్ మాత్రమే కాకుండా, ప్లేఆఫ్స్ మ్యాచ్‌లను కూడా బెంగళూరు నుండి తరలించి ధరంసాల, న్యూ చండీగఢ్‌లకు కేటాయించడం గమనార్హం. కాగా డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బెంగళూరుకు దక్కాల్సిన ఫైనల్ ఆతిథ్యాన్ని చివరి నిమిషంలో వెనక్కి తీసుకోవడంపై కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేఎస్సీఏ అధ్యక్షుడు, మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ స్వయంగా బోర్డు పెద్దలతో మాట్లాడినప్పటికీ ఫలితం లేకపోయింది. తమ స్టేడియం అన్ని హంగులతో సిద్ధంగా ఉన్నప్పటికీ, బోర్డు నుండి సరైన వివరణ లేకుండా మ్యాచ్‌లను తరలించడం నిరాశ కలిగించిందని అసోసియేషన్ పేర్కొంది. ఇది ఇలా ఉంటే.. అధికారికంగా బీసీసీఐ 'ఆపరేషనల్ మరియు లాజిస్టికల్' కారణాలను సాకుగా చూపుతున్నప్పటికీ, దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బెంగళూరులో స్థానిక ఎమ్మెల్యేలకు ఉచిత టికెట్ల కేటాయింపు విషయంలో తలెత్తిన వివాదం, విపరీతమైన వీఐపీ కోటా ఒత్తిడి కారణంగానే బోర్డు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా స్థానిక అధికారుల నుండి వస్తున్న డిమాండ్లను తట్టుకోలేక, పారదర్శకమైన నిర్వహణ కోసం వేదికలను మార్చినట్లు బోర్డు అంతర్గత వర్గాల టాక్. ఈ ఆకస్మిక మార్పుతో బెంగళూరులోని లక్షలాది మంది క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఒకవైపు రాజకీయం, మరోవైపు క్రీడా ప్రయోజనాల మధ్య నలిగిపోతున్న ఐపీఎల్ వేదికల వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

తీన్మార్
తెలుగు దిన పత్రిక

# మాస్‌తో పెట్టుకుంటే మడతే...

దేశ రాజకీయాల్లో చరిత్రలో గత రెండేళ్లు అత్యంత కీలకమైన మార్పులకు సాక్ష్యంగా నిలిచాయి. తమ రాష్ట్రాల్లో ఎదురులేని నాయకులుగా వెలుగొందిన అగ్రనేతలు నేడు తమ సొంత గడ్డపై ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రిగా ఉంటూ ఆమె తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలయ్యారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె 15వేల ఓట్లకుపైగా తేడాతో ఓటమి చెందారు. ఈ ఓటమిని మమతాబెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఇది ప్రజాతీర్పు కాదని, కేవలం లూటీ మాత్రమేనని ఆమె తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత చరిత్రను పరిశీలిస్తే 2021 ఎన్నికల్లో కూడా ఆమె నందిగ్రామ్ నియోజకవర్గంలో ఇదే సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు. అయితే అప్పట్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించడంతో ఆమె ముఖ్యమంత్రిగా కొనసాగారు. కానీ 2026లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక, బీజేపీ రాజకీయ వ్యూహాల ఒత్తిడి ఆమె పతనానికి దారి తీశాయి. దక్షిణ భారత రాజకీయాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఎంకే స్టాలిన్‌కు కూడా 2026 చేదు అనుభవాన్ని మిగిల్చింది. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత స్టాలిన్ తన నియోజకవర్గం కొలత్తూరులో ఊహించని విధంగా ఓడిపోయారు. వరుసగా మూడుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన ఆయనకు ఈసారి ఓటరు మొహం చాటేశారు. టీవీకే పార్టీ అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఆయన 8, 795 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఓటమి స్లాలిన్‌ను, డీఎంకే శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం అనేది ఆ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ గాలికి నిదర్శనంగా చెబుతున్నారు.గతంలో కూడా ఇలాంటి ఉద్దండులు ఓడిపోయిన చరిత్ర ఉంది. రాజకీయాల్లో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేరుకున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఓటర్లు 2025లో షాక్ ఇచ్చారు. ఫిబ్రవి 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓటమి చెందారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ చేతిలో ఆయన సుమారు మూడు వేలకుపైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అధికారంలో ఉన్న వారు ఓడిపోవడం అనే ప్రక్రియ 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఊపందుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీని వల్ల అప్పటి ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్(రాజస్థాన్), భూపేష్ బఘేల్(చత్తీస్‌గఢ్) తమ కుర్చీలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోవడం అనేది కేవలం వ్యక్తిగత ఓటమి కాదు. పశ్చిమ బెంగాల్‌లోనని కీలకమైన నియోజకవర్గం భవానీపూర్‌లో హోరాహోరీ పోరు ముగిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి, మమతా బెనర్జీని 15,114 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం ఆరంభం నుంచే అందరి దృష్టిని ఆకర్షించింది. యాదృచ్ఛికంగా, భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్‌లో కూడా సువేందు అధికారి 9000కుపైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఓటమి తృణమూల్‌కు, ముఖ్యంగా మమతాబెనర్జీకి బిగ్ షాక్ అనే చెప్పాలి. ఈసారి బెంగాల్‌లో కాషాయ తుపాను సంచలనాలు నమోదు చేసింది. చాలా జిల్లాల్లో కమలా పువ్వులు వికసించాయి. అనేక చోట్ల తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపుగా తుడిచిపెట్టేశారు. నందిగ్రామ్, భవానీపూర్ అనే రెండు నియోజకవర్గాల్లో సువేందు అధికారి పోటీ చేయంతో అందరి దృష్టి ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడింది. నందిగ్రామ్‌లో సువేందు సమీప ప్రత్యర్థి తృణమూల్‌కు చెందిన పవిత్ర కర్. ఈ అభ్యర్థి ఎన్నికలకు ముందు బీజేపీని వీడి తృణమూల్‌లో టికెట్ పొందారు. ఈ పవిత్ర కర్ ఒకప్పుడు సువేందు సహాయంతో బీజేపీలో చేరారని వినికిడి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సువేందు ఈ అభ్యర్థిని ఓడించారు. అది ఆయా పార్టీల పతనాన్ని లేదా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని సూచించే కీలక సంకేతం. ఇక అస్సాంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీ తేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం. గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులో లేకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారుభారత రాజకీయాల్లో ఇప్పుడు కొత్త నాయకత్వానికి, మార్పుకు సమయ ఆసన్నమైందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాయకులు తిరిగి పంజుకుంటారా లేదా కొత్త శక్తులు మరింత బలోపేతం అవుతాయా అనేది వేచి చూడాలి.

# దీదీ ధిక్కార స్వరం!



తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విలక్షణ నాయకురాలు. పదిహేనేళ్లపాటు అవిచ్ఛిన్నంగా రాష్ట్రాన్ని పాలించి తొలిసారి ఓటమి చవిచూసిన ఆమె దీన్ని తేలిగ్గా వదలదల్చుకోలేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. 'ఎన్నికల సంఘం(ఈసీ) ఆసరాతో మా గెలుపు కొల్లగొట్టారు. మేం ఓడిపోలేదు. కాబట్టి రాజీనామా చేసే ప్రసక్తే లేద'ని ఆమె బాంబు పేల్చారు. ఆమె అయిదేళ్ల పదవీకాలం ఎటూ ఈ నెల ఏడుతో ముగుస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో గవర్నర్ ఈలోగానే ఆమె ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేస్తారా... లేక గడువు ముగిశాక ఆమెను సచివాలయంలోకి రాకుండా అడ్డుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ఓడిపోయినవారు ప్రత్యర్థి ఎన్నికను న్యాయస్థానంలో సవాలు చేసే ప్రత్యా మ్నాయం ఉంటుంది. అవన్నీ తేలటానికి ఏళ్లూ పూళ్లూ పడుతుంది. సీనియర్ నాయకు రాలు గనుక ఇవన్నీ ఆమెకు సంపూర్ణంగా తెలిసే ఉంటాయి. కానీ అక్కడితో ఆగిపోతే ఆమెకూ, ఇతర నాయకులకూ తేడా ఉండేది కాదు. వైదొలగక తప్పదని తెలిసినా తగినంత రచ్చచేసి నిష్క్రమించటం ఆమె ఎత్తుగడ కావొచ్చు. యూత్ కాంగ్రెస్ నాయకు రాలిగా పనిచేసినప్పటినుంచి మమత స్ట్రీట్ ఫైటర్. వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వంపై సాగిస్తున్న పోరాటంలో పార్టీనుంచి సరైన సహకారం అందటం లేదన్న ఏకైక కారణంతో ఆమె కాంగ్రెస్‌ను విడిచిపెట్టారు. సొంతంగా తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆ తర్వాత ఆమెదంతా అలుపెరగని పోరాట చరిత్ర. ఇంత రగడకు ఏకైక కారణం ఎన్నికల సంఘం(ఈసీ). స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట బిహార్‌లో అమలైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాక కూడా ఇతర రాష్ట్రాల్లోనైనా సజావుగా పూర్తి చేయాలన్న ఇంగిత జ్ఞానం ఆ సంస్థకు లేకపోయింది. బెంగాల్‌లో దాన్ని మరింత అధ్వాన్నం చేసింది. తొలగింపు ల్లోనూ, చేర్పింపుల్లోనూ అవకతవకలకు అంతూ దరీ లేకుండా పోయింది. ఫాం--7 కింద ఊరూ పేరూలేని వారు దాఖలు చేసిన ఫిర్యాదుల్ని ఆసరా చేసుకుని తాఖీదులు పంపడం, కావలసిన పత్రాలన్నీ ఇచ్చాక నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ కాలేదంటూ తొలగించటం వంటివి చోటుచేసుకున్నాయి. పేర్లలో అక్షర క్రమంలో స్వల్ప తేడాలొచ్చినా 'తార్కిక వ్యత్యాసం' పేరిట అనర్హులుగా జమేయటం మరో దాష్టీకం. ఏతావాతా 91 లక్షలమంది ఓటర్లు మాయమయ్యారు. పైగా ఏడు లక్షలమంది రహస్యంగా వచ్చిచేరారని మమత ఆరోపిస్తున్నారు. అజ్యుడికేషన్‌లో మాత్రం కేవలం 1,607 మందికి మాత్రమే ఓటుహక్కు పునరుద్ధరించారు. మిగిలిన లక్షలాది దరఖాస్తులు తేలడానికి ఎన్నేళ్లు పడుతుందో ఎవరూ చెప్పలేరు. ఓటుహక్కు ప్రసాదించే సంస్థ అనే ముద్రనుంచి దాన్ని తొలగించటమే ధ్యేయంగా పనిచేస్తున్న సంస్థగా ఈసీ పరివర్తన చెందటంలో మతలబేమిటి? సర్‌పై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా గత నెల 13న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం, ఓటర్ల జాబితాల్లో భారీస్థాయి తొలగింపులు జరిగితే అది ఎన్నికల ఫలితాలపై 'గణనీయమైన ప్రభావం' కలిగిస్తుందని వ్యాఖ్యానించింది. ఆ పరిస్థితే వస్తే ఏం చేయాలో ఆలోచిస్తామని కూడా చెప్పింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎటూ విపక్షాలు సుప్రీంకోర్టు తలుపుతట్టే అవకాశం ఉంది. విచారకరమైన సంగతేమంటే... ఈ ఎన్నికల్లో తానూ ఒక అభ్యర్థినే అన్నట్టు ఈసీ ప్రవర్తించింది. వచ్చిన కేంద్ర పరిశీలకులు సైతం అందుకు తగినట్టే ఉన్నారు. మరి 'ఓట్ చోరీ' ఆరోపణలు రావటంలో వింతేముంది? ఆంధ్రప్రదేశ్‌లో 2024 నాటి ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై ఇంతవరకూ ఈసీ చేష్టలుడిగినట్టు ఉండిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ చేసిన ఫిర్యాదులకు అతీ గతీ లేదు. నిమిషానికి నలుగురు చొప్పున ఓటేయటం గురించీ, సీసీ టీవీ ఫుటేజ్ మాయం చేయటం గురించీ పరకాల ప్రభాకర్ వంటి సామాజికవేత్తలు ప్రశ్నిస్తుంటే మన్నుతిన్న పాములా కూర్చుంది. ఏ సంస్థా ఇంత సిగ్గుమాలినతనాన్ని ప్రదర్శించిన వైనం దేశ చరిత్రలో ఎన్నడూ లేదు. కనీసం ఇప్పుడు సర్ ప్రారంభించబోయే రాష్ట్రాల్లోనైనా సక్రమంగా ప్రవర్తించటం ఈసీ నేర్చుకోవాలి. లేనట్టయితే అక్కడ కూడా ఇలాంటి ఛీత్కారాలే ఎదురవుతాయి.

# సాగు బాగు కోసం సంగ్రామం



'పొలాలకు పోతూ, వస్తూ ఎదురుపడ్డోళ్లమంతా ఎదల దుఃఖం పంచుకుంటున్నాం' అని ఇటీవల గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా పలుకరిస్తే, జంగిలప్ప అనే రైతు నాతో ఆవేదనను పంచుకున్నాడు. 'రైతుకు ఏమియ్యకున్నా పురస్తేగాని, కనీసంగా పట్టింపు కూడా లేదని అర్థమైనాక అనాథలతీరైతిమని, రెక్కల కష్టం తప్ప మరేపనీ ఎరుగని రైతు లోలోపల తల్లడిల్లిపోతడన్న' అంటూ ఇంజన్న అనే పేద రైతు జతకూడి చెప్తుంటే అక్కడున్న మా అందరిలో ఆవేదన కలిగింది. ఇప్పుడు ఏ ఊర్లో, ఏ రైతును పలుకరించినా ఆ రైతుల్లానే వేదనను వెళ్లగక్కుతున్నారు. వదిలించుకున్న వేదనను మళ్లీ తగిలించుకొని విలవిల్లాడిపోతున్నారు. తెగులంటుకున్న తెలంగాణల గ్రామాలన్నీ దిగులంటుకొని దినదిన గండంలా గడుపుతున్నాయి. ఏ పీడదినాలైతే మళ్లీ కలలో కూడా రాకూడదని పోరాడారో అవే కల్లంలోకి, అందరి పల్లెంలోకి వచ్చి పడ్డాయి. రెండున్నరేండ్లుగా రేవంత్ సర్కార్ రీతిలేని పనితీరు వల్ల, రాష్ట్ర పునాది రంగంలో పస్తుల విధానం పునరావృతమయ్యింది. దశాబ్దాల పోరాటం, తొమ్మిదిన్నరేండ్ల ప్రగతి విప్లవ ఫలాలు బాల నాగమ్మ కథ సినిమాలో మాయలఫకీరు నాగమ్మను మాయం చేసినట్లు అయిపోయాయి. నిజానికి దశాబ్దాల విధ్వంస, వివక్షా విధానాల బారినపడి అప్పులు తప్ప ఏవీ పండవని ఆశలు చాలించుకున్న సాగు రంగాన్ని సస్యశ్యామలం చేయటానికి కేసీఆర్ ప్రభుత్వం పడరాని పాట్లెన్నో పడింది. రాష్ట్ర ఏర్పాటుకు మునుపు వ్యవసాయం దండగ లాంటి అనేక మాటలు పాలకుల నోటి వెంటే వినీవినీ, నీళ్లు లేక, కరెంట్ రాక రాత్రీపగలూ సేను సెలకల కోసం చకోరపక్షుల్లా బతికిన రైతులు వ్యవసాయంపై విశ్వాసం వదిలేశారు. ఆశ, ఆత్మవిశ్వాసం ఆవిరైన అన్నదాతలు అప్పులు, ఆత్మహత్యలు భరించలేక సేద్యానికి సెలవని వలసల జీవితం ఎంచుకున్నారు. అలాంటి అభద్రతాభావంలో తలమునకలై ఉన్న రైతు లోకంలో విశ్వాసం వికసింపజేయటానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వశక్తులు వొడ్డింది. బీఆర్ఎస్ సర్కార్ తెలంగాణ చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్థితిగతులు, సామాజిక అవసరాలపైనే ఆర్థిక నమూనాను రూపొందించుకొని అమలుపరిచింది. పునాదిలో ఆరోగ్యకర స్థితిని స్థిరపరచకుండా, ఉపరితలంలో ఏ ఆర్థిక నమూనాతో ఊరేగినా వొరిగేదేమీ ఉండదనే దృష్టికోణం కలిగిన సర్కార్ కాబట్టే రైతు సంక్షేమ పథకాలను అత్యంత ప్రాధాన్యంగా ఆచరించింది.తెలంగాణ వార్తలు సాగునీరు, విద్యుత్తు, విత్తన పంపిణీ, పంటల కొనుగోలు ఇలా అన్నింటా ప్రతి ఏటా ఏమరుపాటుతో నడుచుకున్నది. అయితే ఏడు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమ పథకాల పేరిట అనుసరించిన మూస, మోస విధానాల వొరవడికి స్వస్తిపలికి వ్యవసాయరంగ శాశ్వత స్థిరీకరణకు లోతైన, మానవీయ నమూనాను కేసీఆర్ సర్కార్ సాగు రంగంలో అమలు చేసింది.

గుండెల నిండా తెలంగాణ తప్ప మరే ధ్యాస లేని గుణమున్న సర్కార్ కాబట్టే చెరువుల నుంచి నదుల వరకు ఏ నీటిబొట్టునూ వదలకుండా వొడిసిపట్టి, వ్యవసాయానికి అనుసంధానించింది కేసీఆర్ ప్రభుత్వం. గోదావరి నుంచి కృష్ణా, తుంగభద్ర వరకు ఏ నది నీటినీ నిరుపయోగంగా కిందకు వదలకుండా కాళేశ్వరం మొదలు తుమ్మిళ్ల దాకా ఏయే ప్రాజెక్టులు, ఎన్నెన్నో ఇక్కట్లను దాటి, వ్యయప్రయాసాలకు వోర్చి కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందో మన కండ్లకు కనిపిస్తున్నాయి. ఎనిమిదేండ్లలో లక్షా 76 వేల కోట్లను ఒక్క సాగునీటి రంగం మీదనే ఖర్చు చేసి కోటిన్నర ఎకరాలకు సాగునీరు అందించిన సర్కార్ ఈ దేశంలో ఏదైనా ఉన్నదా? లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసి 7 వేల మెగావాట్ల నుంచి 19,464 మెగావాట్లకు స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచటమే కాదు, 6 లక్షల 87 వేల 500 కోట్ల ఆస్తులను విద్యుత్తు రంగంలో సృష్టించింది బీఆర్ఎస్ సర్కార్.

కల్లాల్లోనే రైతుల సంపద వడగండ్ల వానకు ఆగమైపోరాదనే దృఢసంకల్పంతో 4 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 24.73 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి నూతన గిడ్డంగులు నిర్మించటమే కాదు, లక్షా 35 వేల కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఆసరాగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. రైతుబంధు, బీమా ఇలా ఎన్నో మానవీయ పథకాల అమలేకాదు, అడుగడుగునా రైతులకు అన్నీ తానై వెంట నిలిచింది.

రేవంత్ సర్కార్ వచ్చిందే తడవుగా రాచి రంపా న పెట్టటానికి అన్నట్లు రైతుబంధుకు గండికొట్టి, నీటి ఇక్కట్లు, కరెంట్ కష్టాలకు తెరలేపింది. చివరికి పండించిన పంటనూ కొనకుండా రైతుల ఉసు రు పోసుకుంటున్నది. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రె స్ ఇచ్చిన గ్యారెంటీలను గుర్తుచేసుకుంటే సీఎంతో ఏ బేతాళ మాంత్రికుడు కూడా తూగలేడు. ప్రతి మండలంలో అధునాతన మార్కెట్ యార్డ్ నిర్మాణంతో పాటు అనేక హామీలిచ్చి ఆదర్శ రైతు రాజ్యం తెస్తామని పాలకులు గొప్పలు చెప్పారు. కానీ రెండున్నరేండ్లలో పట్టించుకునే నాథుడే కరువై అనాథనైపోయాననే వేదనకు రైతు లోకాన్ని గురిచేశారు. ఎగ్గొట్టినా అసమర్థుడని తిట్టి వదిలేశారు. కానీ చివరికి రెక్కల కష్టాన్ని కూడా కొనకుండా వెక్కిరిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరును మాత్రం రైతాంగం జీర్ణించుకోలేకపోతున్నది. కండ్లెదుటే కల్లాలన్నీ అల్లకల్లోలంగా మారిపోతున్నాయి.

ఇప్పుడు ఏ ఊరి రైతును కదిలించినా కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. గ్యారెంటీలు ఎగ్గొట్టిందే కాకుండా, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినవన్నీ కూడా రేవంత్ సర్కార్ నిలిపేసింది. పైగా, వ్యవసాయ రంగంలో విధ్వంసక పాలనా నమూనాను అమలుపరుస్తున్నది. ఇలా ఒకవైపు రైతాంగాన్ని హింసిస్తూ, మరోవైపు ఈనెల 4 నుంచి రైతు వారోత్సవాల పేరిట అసత్యాల డంభాచారానికి ఒడిగట్టిన సర్కార్ గాయం మీద యాసిడ్ పోసినట్లుగా రైతులను ఎగతాళి చేస్తున్నది. అందుకే పొలాలకు పోయే తొవ్వల్లో ఏ ఇద్దరు రైతులు ఎదురుపడ్డా దిగులు పంచుకుంటున్నారు. మన సేద్యం కోసం సంగ్రామం తప్ప మరో మార్గం లేనేలేదు. దానికోసమే నేడు వరంగల్‌లో బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుతో శంఖారావం పూరిస్తున్నది.

# వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**



**మహబూబాబాద్ జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**

వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని, ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ గంగారం, మహబూబాబాద్ మండలాలలో విస్తృతంగా పర్యటించారు, గంగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్, మందుల స్టాక్, సిబ్బంది హాజరు, రిజిస్టర్లను పరిసరాలను పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో స్వయంగా మాట్లాడి అందిస్తున్న వైద్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వేసవికాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్, వారిగా వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, వేసవి తీవ్రత లో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు తెలియపరచాలని, ఓ ఆర్ ఎస్, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరం ఉన్నచోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి, మాత, శిశు మరణాలను తగ్గించాలన్నారు, లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘ పెట్టి గమనిస్తూ ఉండాలని, హిట్ వే ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అవసరమైతే తప్ప బయటికి వెళ్లకుండా చూడాలని, షెడ్యూలు ప్రకారం వైద్య సేవలను కొనసాగించాలని అన్నారు. మహబూబాబాద్ మండలం అమనగల్, పర్వతగిరి గ్రామాలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను సందర్శించారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం సూచించిన ప్రకారం కొనుగోలు చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని, ప్రస్తుతం అకాల వర్షాలు పడే సూచన ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేయాలని, కేంద్రాలలో గన్ని సంచులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్స్, సిద్ధంగా ఉంచుకోవాలని, త్రాగునీరు, టెంట్, చైర్స్ వైద్య సేవలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు, సహకార 151, ఐకెపి 53, మెప్మా1, గిరిజన కార్పొరేషన్ 8, శాఖల ఆధ్వర్యంలో మొత్తం (213) కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందని అట్టి కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు, జిల్లా లక్ష్యం పూర్తి చేయుటకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, కేంద్రాల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్ల లో రైతులను ఇబ్బంది పెట్టితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ధాన్యం కొనుగోళ్లు, రవాణా తదితర సంబంధిత విషయాలలో సమస్యలు ఉంటే వెంటనే 7995050789 హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, తహసిల్దార్లు, బాలకిషన్, రాజేశ్వరరావు, ఎంపీడీవో వైష్ణవి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# వార్షిక మొబిలైజేషన్ శిక్షణలో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహణ

**అధికారుల ఫైరింగ్‌ను స్వయంగా పరిశీలించిన ఎస్పీ**



**భూపాలపల్లి, మే 06 (తీన్మార్ న్యూస్):**

వరంగల్ జిల్లా అమ్మవారిపేట ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీసు సీనియర్ అధికారులు మరియు ఎస్‌హెచ్‌ఓలు ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ హాజరై అధికారుల ఫైరింగ్‌ను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆయుధాల పనితీరును పరిశీలిస్తూ, ఎస్పీ కూడా వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, ఆయుధాల వినియోగంలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగంగా, సమర్థవంతంగా స్పందించే సామర్థ్యం పోలీసు సిబ్బందిలో పెంపొందుతుందని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి ఆయుధాల వినియోగంపై పూర్తి ప్రావీణ్యం సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే, సీనియర్ అధికారులు మరియు ఎస్‌హెచ్‌ఓలు తమ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, ఫైరింగ్ గ్రౌండ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలను స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, అందుకు అవసరమైన శిక్షణను నిరంతరం అభ్యసించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తుపాకులతో విధులు నిర్వహించే అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు పోలీసుల ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతి అధికారి అప్రమత్తత, క్రమశిక్షణ, సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ,సి.ఐలు, ఆర్.ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మల్టీ లెవెల్ సైంటిఫిక్ పార్కింగ్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం



**హనుమకొండ, మే 06 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం హనుమకొండలోని అశోక్ టాకీస్ ఎదురుగా మునిసిపల్ స్థలంలో రూ.15 కోట్ల వ్యయంతో మున్సిపల్ ఎస్పీవీ నిధులతో నిర్మించనున్న మల్టీ లెవెల్ సైంటిఫిక్ పార్కింగ్‌కు శంకుస్థాపన చేశారు. నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాలుగు అంతస్తులతో నిర్మించనున్న ఈ ఆధునిక పార్కింగ్‌లో ఒకేసారి సుమారు 100 కార్లు, 100 ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. నగర ట్రాఫిక్ సమస్యకు ఇది శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి హనుమకొండ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడి సదుపాయాలను పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మీ, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్ , బల్దియా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టాల పట్టడం లేదు

**వరంగల్ :** వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొనియాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలే శారని, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించ లేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేత లను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## క్రిషాంక్ కు బెయిల్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలులో జరిగిన అవకతవకలు, మంత్రులపై తాను చేసిన విమర్శల కారణంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఈ సందర్భంగా ఆరోపించారు.

## తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**మహాదేవపూర్, మే 06 (తీన్మార్ న్యూస్):**

రైతులకు ఇబ్బంది లేకుండా ఆకాలవర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మహాదేవపూర్ మండలంలోని మహదేవ పూర్, సూరారం గ్రామాలలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించి, రైతులతో ముకాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు రవాణా, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపిడిఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో డైనింగ్ హాల్ భూమిపూజ, భవనం ప్రారంభోత్సవం



**హనుమకొండ, మే 06 (తీన్మార్ న్యూస్):**

హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తలసీమియా బాధితుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న డైనింగ్ హాల్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా, రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హనుమకొండ రెడ్ క్రాస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని రెడ్ క్రాస్ మార్గ్ గా నామకరణం చేసి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రక్తదాన సేవలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న రెడ్ క్రాస్ సేవలను అభినందించారు. తలసీమియా బాధితుల కోసం నిర్మించబడుతున్న డైనింగ్ హాల్ భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. డైనింగ్ హాల్‌ను నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు, మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గారికి రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ డైనింగ్ హాల్ నిర్మాణ భూమిపూజలో పాల్గొని, టైలరింగ్ సెంటర్, జనరిక్ మెడికల్ షాప్, రెడ్ క్రాస్ పరిపాలన భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ హెచ్. సంధ్యారాణి, బిళ్ళ రమణారెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వరంగల్ జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్):**




వరంగల్ జిల్లా పరిధిలోని ఏనుమాముల ఈవీఎం గోదాంను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉన్నాయా లేదా అని కలెక్టర్ సమీక్షించారు. అలాగే, గోదాంలో విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యల అమలుపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత ముఖ్యమని, ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్య రాణి , వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డి టి రంజిత్,సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు

### వరంగల్ సీపీని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు

వరంగల్, మే 06 (తీన్మార్ న్యూస్): హంటర్ రోడ్డులో నిర్వహించిన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ మరియు వరంగల్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అయూబ్ ఖాన్‌లు ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని, ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అసభ్యకరంగా మాట్లాడటం సరికాదని వారు మండిపడ్డారు. ప్రజల మధ్య విద్వేషాలు రేకెత్తించేలా, వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్న ఈ వ్యాఖ్యలపై తక్షణమే వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని వారు సీపీని



కోరారు. రాజకీయ విమర్శలు విధానపరంగా ఉండాలి తప్ప, వ్యక్తిగత దూషణలకు దిగడం అన్యాయమని నేతలు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే కేటీఆర్‌పై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని సీపీకి అందజేసి, త్వరితగతిన విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

# టోకెన్ పద్ధతి ని ఖచ్చితంగా పాటించాలి

### అకాల వర్షాలపై కేంద్ర నిర్వాహకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్): ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో ఆలస్యం జరగకుండా టోకెన్ పద్ధతి ని పక్కాగా అమలు చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం నర్మెట్ట మండలం బొమ్మకూరు గ్రామం లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు ఇచ్చారు. టోకెన్ పద్ధతి ని అమలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు రావని, కాంట కరెక్ట్ గా చేసి వెంట వెంటనే కొనుగోలు అయిన ధాన్యాన్ని మిల్లు లకు తరలించాలన్నారు. లారీలు సమయానికి రాకపోతే తక్షణమే సమాచారం అందించాలన్నారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని మిల్లు లకు తరలించని వెహికిల్ యాజమాన్యం పైన తప్పకుండ చర్యలు ఉంటాయన్నారు. కేంద్ర నిర్వాహకులు కొనుగోలు కి



సంబందించిన అన్నీ రిజిస్టర్ లను పక్కాగా నిర్వహించాలని సరిపడా గన్ని బ్యాగ్ లను అందుబాటులో పెట్టుకోవాలన్నారు ఓపీఎంఎస్ లో కూడా త్వరగా కొనుగోలు అయిన ధాన్యం వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం రైతుల తో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ పైన వారి అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ లను కప్పి పెట్టుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

# నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

### విత్తనాలు సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్): ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని




హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులకు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహణ

**మహబూబ్‌నగర్ :** పట్టణంలోని విరాట్ విశ్వకర్మ సహకార సంఘం కార్యాలయం నందు బులియన్ మార్కెట్ మరియు స్వర్ణకారులు సంఘం సభ్యులతో కలిసి బంగారు దుకాణాల యజమానులు మరియు స్వర్ణకారులకు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి, నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, బంగారు దుకాణాలు మరియు స్వర్ణకారుల భద్రత కోసం పటిష్టమైన ఏర్పాట్లు అత్యవసరమని తెలిపారు. ప్రతి షాప్‌లో నాణ్యమైన సీసీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. కెమెరాల ఫుటేజ్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రపరచడం, షాప్ ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు స్పష్టంగా కవరయ్యేలా ఏర్పాటు చేయడం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా అలారం సిస్టమ్స్, సురక్షిత లాకర్లు వంటి భద్రతా ఏర్పాట్లతో పాటు మొబైల్ అలర్ట్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా సాంకేతికతలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే జిల్లా పోలీస్ అధికారులకు బంగారు షాపులు ఉన్న ప్రాంతాలలో గస్తీని మరింత బలోపేతం చేయాలని, నిరంతరం మొబైల్ పార్టీలు తిరుగుతూ పర్యవేక్షణ నిర్వహించాలని ఎస్పీ గారు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ యాత్ర/టికెట్ బుకింగ్ మోసాలు, ఫేక్ కాల్స్ మరియు మెసేజెస్ ద్వారా డబ్బులు మోసగించే ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు. తెలియని లింకులు క్లిక్ చేయకుండా, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకుండా, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు భద్రత కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, స్వీయ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. "ప్రజా భద్రతే మా ధ్యేయం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పోలీసులతో సమన్వయం కలిగి పనిచేయాలని ఎస్పీ కోరారు.

## ఈ నెల 8న మెగా జాబ్ మేళా



వరంగల్ జిల్లా, మే 06 (తీన్మార్ న్యూస్): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ శుక్రవారం కాళోజి కళా క్షేత్రంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 కంపెనీలు ఉద్యోగ అవకాశాల కల్పనకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ నిఖిత బోగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై వి గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రమేష్, జిఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి సంబంధిత అధికారులు, యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


## చింతల్ లో సంచలనంగా మర్డర్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య సంచలనంగా మారింది. హత్య జరిగిన తీరు తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని అత్యంత కిరాతకంగా నిద్రలోనే పరలోకానికి పంపేశారు తల్లీ,కొడుకులు. శవాన్ని మాయం చేసే క్రమంలో ఇంటి ఓనర్‌కు అనుమానం రావడంతో పోలీసులకు చిక్కారు. దీంతో మొత్తం మర్డర్ స్కెచ్ బయటపడింది.చింతల్ అంబేద్కర్ నగర్‌లో శివారెడ్డి అనే వ్యక్తితో పదేళ్ల క్రితం గార్లపల్లి అరుణకు పరిచయం ఏర్పడింది. బాలానగర్‌లోని సూర్య ఇంజనీరింగ్ వర్క్స్‌లో ఇద్దరూ పని చేస్తుండగా ఏర్పడిన పరిచయం కాస్తా, సహజీవనం వరకూ వెళ్లింది. గత పదేళ్లుగా ఇద్దరూ కలిసే ఉంటున్నారు. శివారెడ్డితో పరిచయానికి ముందే అరుణకు, సాయిరత్నం అనే కొడుకున్నాడు. తల్లి,కొడుకూ వాళ్లు ఉంటున్న ఇంట్లోనే శివారెడ్డికి ఆశ్రయం కల్పించారు. అలా బాలానగర్ సమీపంలో ఒకే ఇంట్లో ఉంటున్న ముగ్గురూ ఇటీవల చింతల్ అంబేద్కర్ నగర్‌కు ఇల్లు మారారు.రోజూ మద్యం సేవించే అలవాటున్న శివారెడ్డి , తప్పతాగి ఇంటికొచ్చి అరుణను , ఆమె కుమారుడు సాయిరత్నాన్ని విపరీతంగా వేధించేవాడు. మానసికంగా , శారీరకంగా చిత్రహింసలకు గురిచేసేవాడు. అలా శివారెడ్డి వేధింపులు భరించలేని తల్లి, కొడుకులూ కలసి శివారెడ్డిని హతమార్చేందుకు ప్లాన్ చేశారు. హత్య చేయాలనుకున్న నాటి నుంచి పక్కా ప్లాన్‌తో ముందుకెళ్లారు తల్లీ , కొడుకులు . ముందుగా యూట్యూబ్ వీడియోలను చూసిన కొడుకు సాయిరత్నం, శివారెడ్డిని ఎలా చంపాలనేది ప్లాన్ చేశాడు. యూట్యూబ్ వీడియోల తల్లికి చూపించిన హత్యకు ప్లాన్ చెప్పాడు. గూగుల్ సహాయంతో కత్తి ఎక్కడ కొనాలి, హత్య తరువాత ఎలా తప్పించుకోవాలనేది రూట్ మ్యాప్ సైతం సిద్దం చేసుకున్నారు. అనుకున్నది అనుకున్నట్లుగా అమలు చేసేందుకు ఈనెల 3వ తేది అర్థరాత్రి దాటిన తరువాత, రోజూ మాదిరి తప్పతాగి ఇంటికొచ్చిన శివారెడ్డికి ఏమాత్రం అనుమానం రాకుండా , భోజనం పెట్టి పడుకోబెట్టారు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో అప్పటికే కొనుగోలు చేసిన మటన్ కత్తితో, ఒకరు పట్టుకోగా, మరొకరు అత్యంత కిరాతకంగా గొంతు కోశారు. శివారెడ్డి ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించుకున్న తరువాత శవాన్ని సంచిలో మూటకట్టి, తరలించే క్రమంలో స్థానికులకు, ఇంటి యజమానికి అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు తరువాత నిందితులను తమ స్టైల్‌లో విచారించగా వాస్తవాలు వెలుగుచూశాయి. గూగుల్ ఉపయోగించి, హత్యకు ప్లాన్ వేసినట్లు, హత్య తరువాత ఎలా తప్పించుకోవాలో కూడా గూగుల్ మ్యాప్స్ ద్వారా స్కెచ్ వేసినట్లుగా నిందితులు అంగీకరించారు. మంచి కోసం ఉపయోగించే గూగుల్ టెక్నాలజీని ఇలా హత్యల కోసం వాడేస్తుండటం పోలీసులకు సైతం షాకిచ్చింది.

## లోపాలను ఎత్తి చూపడమే జర్నలిజం

**హైదరాబాద్ :** అంతర్జాతీయ జర్నలిస్టుల సమాఖ్య 100వ వార్షికోత్సవ కాంగ్రెస్ వేడుకల్లో సీనియర్ జర్నలిస్ట్ సిల్వేరి శ్రీశైలం హాజరయ్యారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 3 రోజుల పాటు జరిగిన చారిత్రాత్మక సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మీడియా బలంగా వుండాలని.... 'ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభమని తెలిపారు. లోపాలను నిర్భయంగా ఎత్తిచూపడమే పత్రికల ఉద్దేశ్యమని..., ఇటీవల కాలంలో ఈ 'నిర్భీతి'కి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అణచివేతను ప్రశ్నించే స్వతంత్ర మీడియా సంస్థలు, జర్నలిస్టులపై దేశద్రోహం, యుఎపిఎ వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ఆందోళనకరమన్నారు. . సమాచార ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా వాస్తవాలను బయటకు రాకుండా చేసే ప్రయత్నంలో భాగమేనని... . జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని, ముఖ్యంగా రాజకీయంగా సున్నితమైన అంశాలపై వార్తలు రాసే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. మారుతున్న సాంకేతిక కాలంలో జర్నలిజం ఎదుర్కొంటున్న సవాళ్లు, డిజిటల్ యుగంలో వార్తా సేకరణలోని సాధకబాధకాలు వంటి అంశాలపై చర్చించనున్నట్టు సిల్వేరి శ్రీశైలం తెలిపారు. భవిష్యత్తు తరాల జర్నలిస్టులకు ఒక దిశానిర్దేశం చేయనున్న ఇలాంటి అత్యున్న త స్థాయి సదస్సులో పాల్గొనడం ద్వారా లభించే అనుభవం, మన దేశంలో బాధ్యతాయుతమైన, పారదర్శకమైన జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది ఆయన అన్నారు.పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు మాత్రమే కాదు, సమాచారం తెలుసుకోవాలనే పౌరుల ప్రాథమిక హక్కు.పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత గురించి చర్చిస్తున్న తరుణంలో, భారతీయ మీడియా ఎదుర్కొంటున్న సవాళ్లను, సాధించిన విజయాలను ఈ అంతర్జాతీయ వేదికపై వినిపించే అవకాశం దక్కడం తెలుగు జర్నలిస్ట్ సిల్వేరి శ్రీశైలానికి దక్కడం విశేషం. ఇది వ్యక్తిగత గౌరవమే కాకుండా, మన దేశ జర్నలిస్టులందరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నట్టు ఔజఏఏ కార్య వర్గం తెలిపింది. జర్నలిస్టుల హక్కులు, వారి భద్రత, స్వయంప్రతిపత్తిని కాపాడటమే లక్ష్యంగా ఈ అంతర్జాతీయ ఫోరమ్ ప్రధాన ఉద్దేశం.ఈ సమావేశాల్లో 140 దేశాల నుండి జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. 1972లో స్థాపించబడిన ఔజఏఏ దేశంలో నైతిక బాధ్యతాయుతమైన జర్నలిజం కోసం, జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోంది. సిల్వేరి శ్రీశైలం 2018 నుంచి 2021 వరకు ఔజఏఏ జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో రాజేంద్ర ప్రభు, ఎన్.డి. త్రిఖా వంటి దిగ్గజ జర్నలిస్టుల మార్గదర్శకత్వంలో పత్రికా స్వేచ్ఛ కోసం, పని చేసే జర్నలిస్టుల ప్రాథమిక హక్కుల కోసం ఆయన పోరాడారు. ప్రస్తుతం ఆయన ఛానల్‌లో సెంట్రల్ డెస్క్ ఇన్ఛా ర్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బల్క్ డ్రగ్ కుంభకోణం, మిలిటరీ డైరీ ఫామ్ అవకతవకలు, ఆర్మీ రిక్రూట్‌మెంట్ స్కామ్, ఃఆఒ బాడీ ఆర్మర్ ప్లేట్ల వ్యవహారం మరియు మిధాని ( ఫర్నేస్ కొనుగోలు స్కామ్ వంటి వాటిపై ఆయన చేసిన రిపోర్టింగ్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

# హీరోల యాటిట్యూడ్‌పై వ్యాఖ్యలు.. అల్లు అర్జున్‌ని కాదంటూ రవిబాబు క్లారిటీ



ఝజఱ దీుఎబ । తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు రవిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. కథ ఏదైనా సరే దానికి వినూత్న ట్రీట్‌మెంట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా తన ముద్ర వేసిన రవిబాబు.. తాజాగా 'రేజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రేజర్ మే 8న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్లలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ, "ఒక్క హిట్ వచ్చినా హీరోల బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది. కళ్లజోడు పెట్టుకుని బిల్డప్పులు కొడతారు" అని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యలు నేరుగా అల్లు అర్జున్‌ని ఉద్దేశించి చేసినవేనని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్తో భారీ క్రేజ్ సంపాదించిన అల్లు అర్జున్ ప్రవర్తనను ఉద్దేశించారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన రవిబాబు, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.నేను సోషల్ మీడియాలో లేను. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇండస్ట్రీలో సాధారణంగా జరుగుతున్న విషయాలపై మాత్రమే మాట్లాడాను అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అల్లు అర్జున్ 'పుష్ప 2' ప్రమోషన్ల సమయంలో ఆయన ప్రవర్తనపై సోషల్ మీడియాలో పలు చర్చలు జరిగాయి. 'తగ్గేదేలే' అనే పాత్ర యాటిట్యూడ్‌ను బయట కూడా చూపిస్తున్నారని, కొంతమంది అది అహంకారంగా కనిపిస్తోందని విమర్శించారు.ముంబైలో జరిగిన ప్రెస్ మీట్లలో ఆయన బాడీ లాంగ్వేజ్, సమాధానాల తీరు కూడా ట్రోలింగ్‌కు గురైంది. అలాగే ఆయనను కలవాలంటే కఠిన ప్రోటోకాల్ పాటించాలన్న వార్తలు కూడా వైరల్ అయ్యాయి.వివాదాల్ని పక్కనబెడితే, రవిబాబు ప్రస్తుతం రేజర్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది.అడవి నేపథ్యంలో జరిగే ఈ కథలో, మనుషుల కంటే జంతువులే ఎక్కువ వివేకంతో ప్రవర్తిస్తాయనే కాన్సెప్ట్‌ను చూపించనున్నారు. ముఖ్యంగా సినిమాలో కనిపించే కుక్క పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి వైదీ సంగీతం అందించగా, 'ఫ్లయింగ్ ఫ్రాగ్స్' బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్ కూడా హైలైట్‌గా ఉండనున్నాయి.



# సెయాన్' మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే డివైన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.

గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది. తారాగణం: శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే

# మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్.. కొరటాల శివ సినిమాలో పవర్‌ఫుల్ రోల్!



నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో 'ఎన్టీఆర్ బయోపిక్' (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హై-వోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య 'ఊరమాస్' అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

# 'అమరం' మూవీ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్



తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్ట్రన్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది.వెస్ట్రన్ ఘాట్స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్న ప్రత్యేక యాక్షన్ బ్లాక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బాంబేకు చెందిన మార్షల్ ఆర్ట్స్ టీమ్ సహకారంతో మాస్టర్ మిరాకిల్ మైఖేల్ ఆధ్వర్యంలో మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించారు. లోతైన ప్రేమకథను సిట్యువేషనల్ యాక్షన్‌తో మేళవించి చిత్రాన్ని రూపొందించారు. తేజేష్ తొలి సినిమాకే అద్భుతమైన యాక్షన్ బ్లాక్స్‌లో నటించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొడైకెనాల్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం డాల్ఫిన్ నోస్ వద్ద తెరకెక్కించిన ఒక కీలక సన్నివేశాన్ని ఆయన సింగిల్ టేక్‌లో పూర్తి చేయడం విశేషం. హీరోయిన్‌గా ఐరా అగర్వాల్ నటించగా, నాగినీడు, సాయి ధీనా, జార్జ్ మరియన్, సురేష్ చంద్ర మీనన్, హరీష్ పరాడి తదితరులు కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన తిరువరుల్ కృష్ణన్ గతంలో నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ వద్ద అసోసియేట్‌గా పనిచేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, 'వడచెన్నై', 'అసురన్' చిత్రాలకు ఎడిటింగ్ చేసిన రామర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కొత్త సినిమాటోగ్రాఫర్ భరత్ విజువల్స్ అందించారు.ఈ చిత్రంలో ఐదు పాటలు ఉండగా, వాటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బూపతి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన రాజు సుందరం, ప్రభుదేవా మాస్టర్లకు సన్నిహిత సహాయ కుడిగా మంచి గుర్తింపు పొందారు. కొడైకెనాల్‌లో ఆర్ట్ డైరెక్టర్ జనా సర్ రూపొందించిన భారీ సెట్‌లో ఓ ప్రత్యేక ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాటలో కేరళకు చెందిన 60 మంది డ్యాన్సర్లు పాల్గొనడం విశేషం. మిక్కీ జే మేయర్ అందించిన ఈ ఫోక్ నెంబర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేర్వేరు సామాజిక వర్గాల నుంచి వచ్చిన ఓ జంట అనుకోని పరిస్థితుల్లో చేసే ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలతో సినిమా ఉత్కంఠభరితంగా సాగనుంది.

# 'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా.. ఆ సినిమాతో పోల్చొద్దు : లావణ్య త్రిపాఠి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ యాక్షణ్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463